19102023-MAI-06_Layout 1 10/19/2023 3:59 AM Page 1

నమస్తే తెలంగాణ

స్వలింగ వివాహాలు

స్వలింగ సంపర్కుల విషయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీల విధానాలు ముందుకువస్తున్నాయి. అనేక దేశాల్లో వారి వివాహాలకు చట్టబద్ధత ఏర్పడింది. ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పిల్లలను కనడం లేదా దత్తత తీసుకోవడం విషయంలోనూ సానుకూల నిబంధనలున్నాయి. భారత్‌లోనూ అదే తరహా వ్యవస్థ రావాలని కాంక్షించిన ఇక్కడి స్వలింగ సంపర్కులకు సుప్రీంకోర్టు నిరాశ కలిగించింది. వివాహ హక్కుల కోసం వారు జరిపిన సుదీర్ఘ న్యాయపోరాటానికి చుక్కెదురైంది. కాలం చెల్లిపోయిన చట్టాలను తొలగించి, మారిన పరిస్థితులకు అనుగుణంగా కొత్తకొత్త చట్టాలు మన దేశంలోనూ వస్తున్నాయి. అలాగే వ్యక్తిగత హక్కులపై, ఎంపికలపై స్వేచ్ఛాయుతమైన నిర్ణయాలు విస్తరిస్తున్న పరిస్థితులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రత్యేక వివాహాల చట్టానికి లింగభేదాతీతమైన నిర్వచనం ఇస్తుందని స్వలింగ సంపర్కులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ మధ్య జరిగే వివాహాలకు ప్రత్యేక వివాహాల చట్టంలో గుర్తింపు ఇవ్వాలన్న వారి ప్రధానమైన నివేదనను సర్వోన్నత న్యాయస్థానం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఆ చట్టంలో 'ఇద్దరి మధ్య వివాహ బంధం' అని ఉన్నచోట 'ఏ లింగానికి చెందిన ఇద్దరైనా' అనే నిర్వచనం ఇచ్చేందుకు నిరాకరించింది.

ఇద్దరు వ్యక్తుల మధ్యన కుదిరే వివాహబంధాన్ని గుర్తించే ఆ చట్టం కింద తమ వివాహాలనూ చేర్చమని స్వలింగ సంపర్కులు పలు వ్యాజ్యాలు దాఖలుచేసిన సంగతి తెలిసిందే. చట్టం ఆధారంగా మాత్రమే గుర్తింపు ఇవ్వడం సాధ్యమని అనడం ద్వారా ప్రభుత్వ వాదనను బలపరిచినట్టయింది. స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించడమనేది శాసనవ్యవస్థ పరిధిలోని అంశమని ప్రభుత్వం వాదించిన సంగతి తెలిసిందే. అంటే ప్రభుత్వం పూనుకొని ప్రత్యేక చట్టం తెస్తే తప్ప ఈ తరహా వివాహాలకు గుర్తింపురాదని తేలిపోయింది. మతపరమైన, సాంస్కృతికమైన కారణాలతో భారతదేశంలోని వివిధ వర్గాలు స్వలింగ సంపర్కుల వివాహాలను చట్టబద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టం తెచ్చేందుకు ముందుకువచ్చే అవకాశాలు బహు తక్కువగా ఉన్నాయి.

కోర్టు తీర్పులో స్వలింగ సంపర్కులకు కొన్ని ఉపశమనాలూ లేకపోలేదు. వారికి ఒక్కటయ్యే విషయంలో గల హక్కులను గుర్తించడం గమనార్హం. స్వలింగ సంపర్కులకు ఒత్తిడి, బెదిరింపులేకుండా సహజీవనం చేసే హక్కుందని ధర్మాసనం గట్టిగా సమర్థించింది. వివాహం అనేది ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పడం ఈ తీర్పులోని మరో ముఖ్యాంశం. ప్రాథమిక హక్కు కానప్పుడు వివక్ష సమస్య తలెత్తదు. వివక్షను నిరోధించే చట్టాలూ వర్తించవని అర్థం. పిల్లలను దత్తత తీసుకునే హక్కూ వారికి లేదని కోర్టు స్పష్టం చేయడం గమనార్హం. అందరిలాగే తమకూ వివాహ హక్కు ఉండాలన్న ఆకాంక్ష సాకారం చేసుకునేందుకు స్వలింగ సంపర్కులు మరింత సుదీర్ఘమైన పోరాటమే చేయాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు తెలియజేస్తున్నది.

అగ్గికి ఆజ్యం పోసేదే కాంగ్రెస్

డాక్టర్ ఎంప శ్రీనివాసన్

కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం ఏమిటి? ఒకటి.. ఫెడరల్ స్ఫూర్తి లేదు. రాష్ట్రాల మీద గౌరవం లేదు. రెండు.. ప్రజల ఆకాంక్షలు పట్టవు. తాత్కాలిక తాయిలాలతో బండి లాగిస్తుంది తప్ప సమస్య పరిష్కరించదు. మూడు.. సమస్యలు తానే సృష్టిస్తుంది. లేదా ఉన్న సమస్యలో ఆజ్యం పోసి రాజకీయం చేస్తుంది. పరిస్థితి తిరగబడి పీక మీద కత్తి పెడితేనే స్పందిస్తుంది. స్వాతంత్ర్యానంతరం దేశ రాజకీయాలను ఎక్కువ కాలం శాసించిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, ఆలోచన తీరు స్థూలంగా ఇదే. దేశంలో జరిగిన కొత్త రాష్ట్రాల ఏర్పాట్ల సందర్భాలన్నీ రాష్ట్రాల డిమాండ్లు సాయుధ పోరాటాల స్థాయికి చేరి పరిస్థితి అదుపు తప్పడమో, లేదా తాను రాజకీయంగా సమాధవుతానన్న భయం ఆ పార్టీని వెంటాడటమో జరిగినప్పుడే కాంగ్రెస్ స్పందించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటూ ఇలాగే జరిగింది. అందుకే తెలంగాణ ప్రజలు ఆ పార్టీ మీద శాశ్వతంగా విశ్వాసం కోల్పోయారు.

60 ఏండ్ల ద్రోహ చరిత 7

ఎవరి ఆచరణ అయినా వాళ్లు ఆలోచించే సిద్ధాంతాల పైనే ఆధారపడి ఉంటుంది. అది వ్యక్తులు కావచ్చు, పార్టీలు కావచ్చు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అతి ఎక్కువ కాలం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉంది కాబట్టి కాంగ్రెస్ పార్టీ రాజకీయ అవగాహన, ఆచరణ దేశ రాజకీయాలను ప్రభావితం చేసింది. కాంగ్రెస్ రాజకీయ ఆచరణలో ముఖ్యమైన అంశాలు ఏమిటి.

రాష్ట్రాలంటే చిన్న చూపు

మొదటిది, కాంగ్రెస్ ఎప్పుడూ ఫెడరల్ (సమాఖ్య) స్ఫూర్తిని నమ్మలేదు. బలమైన కేంద్ర ప్రభుత్వం పేరిట రాష్ట్రాల, ప్రాంతాల అధికారాలను అణచి వేస్తూ వచ్చింది. రాజ్యాంగాన్ని ఉపయోగించుకొని అనేక రాష్ట్ర ప్రభుత్వాలను పేక మేడల్లా కూల్చేయడం అందులో భాగమే. ఇదే వైఖరి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కూడా పాటించింది. తెలంగాణను ఇప్పుడే ఆంధ్రతో కలపొద్దని స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిటీ చెప్పినా కలిపివేయడం వెనుక ఇదే భావజాలం ఉన్నది. ప్రాంతీయ ఆకాంక్షలను చిదిమేసి కేంద్రీయ అధికారాన్ని కాంగ్రెస్ చేతిలో సుస్థిరం చేసుకోవడమే దీనివెనుక ఉన్న ఏకైక లక్ష్యం. చిన్న రాష్ట్రాల ఏర్పాటు మీద కాంగ్రెస్ అవగాహన ఏమిటి? ఎలా స్పందిస్తుంది? అనుభవాలు చెప్తున్నది ఏమంటే.. కొత్త రాష్ట్రాలను ఏర్పాటుచేయడంలో సాధారణంగా కాంగ్రెస్ పార్టీ పెద్దగా ఉత్సాహం చూపదు. కాంగ్రెస్ పార్టీ వైఖరి గురించి శ్రీకృష్ణ కమిటీ రిపోర్ట్ సైతం ఇదే తెలిపింది. 1960లలో, 70లలో కొత్త రాష్ట్రాల ఏర్పాటును అవి తప్పనిసరి కాబట్టే ఒప్పుకున్నది. ఇక 1980ల తర్వాత కాలంలో బోడో లాంటి ప్రాంతాలతో ప్రత్యేక హిల్ కౌన్సిల్స్ వంటి ఏర్పాటు వరకు ఒప్పుకున్నది. అది కూడా ఈశాన్య భారతంలో, బోడోలు, ప్రత్యేక ప్రతిపత్తిని డిమాండ్ చేసిన వాళ్లు, కొన్ని సంద ర్భాల్లో సాయుధ పోరాటాన్ని మొదలు పెట్టిన ప్పుడే. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల మీద కేంద్రం చేసిన దౌర్జన్యం, రాజకీయ మోసం గురించి ఎన్నో ఉదాహరణలున్నాయి. స్వాతంత్ర్యానికి ముందునుంచి ఉన్న జార్ఖండ్ ప్రత్యేక ఆదివాసీ రాష్ట్ర కల, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా నెరవేరడానికి యాభై ఏండ్లు పట్టింది. మూడు దశాబ్దాల పాటు పోరాడితేనే జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రత్యేక రాష్ట్రం సాకారమైంది తప్ప, తూర్పు భారతంలోని ఆదివాసీల ప్రజాస్వామిక ఆకాంక్ష కాంగ్రెస్‌ను కరిగించలేదు. హిమాలయాల ఒడిలో ఉన్న ఉత్తరాఖండ్ పహాడీలు ఉత్తరప్రదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేక ఉత్తరాఖండ్‌గా ఏర్పడటానికి ఎన్నో దాష్టీకాలను సహించాల్సి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని బస్తర్ ఆదివాసీలు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని కోరుకుంటే అది మావోయిస్టుల డిమాండ్‌గా ముద్రవేసి వ్యతిరేకించింది కాంగ్రెస్సే.

సమస్యలు వాళ్లే సృష్టిస్తారు..

ఇక రెండవది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రాంతాల్లో లేక రాష్ట్రాల్లో వచ్చే సమస్యలకు కారణాన్ని కాంగ్రెస్సే సృష్టిస్తుంది, సమస్యలను రెచ్చగొడుతుంది. అందులో భాగమవుతుంది, పరిష్కారం కూడా తానే చూపించగలనని చెప్తుంది. ఈశాన్య భారతం, పంజాబ్, కశ్మీర్‌లలో వచ్చిన నిరాయుధ, సాయుధ ఉద్యమాలకు కాంగ్రెస్ పాలసీలు కారణం కాదా? హైదరాబాద్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి తెలంగాణ భాగాన్ని ఆంధ్రతో కలిపేయడం ఇందులో భాగమే.

అంతా ఢిల్లీ గుప్పిట్లోనే..

ఇక మూడవది, ప్రజాస్వామిక డిమాండ్ల పరిష్కారం కేంద్ర అధిష్ఠానం అధీనంలో మాత్రమే ఉండటం. రాష్ట్ర నాయకత్వం ఎప్పుడూ రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ కాదు, వాళ్లు వాళ్ల పార్టీ నాయకత్వానికి మాత్రమే విధేయులు. ఈ అంశమే తెలంగాణ కాంగ్రెస్ నాయకులను అణచిపెట్టింది. ఎన్నికలు వచ్చినప్పుడు తప్ప తెలంగాణ ఆకాంక్షలు, అభివృద్ధి పట్టని కాంగ్రెస్ అధిష్ఠానం అరవైయ్యేండ్ల ఘటనలకు, నష్టాలకు జవాబుదారీగా మిగులుతుంది. ఇక్కడ ఒక సంఘటనను ప్రస్తావించుకోవాలి. తెలంగాణ ఏర్పాటుకు ప్రణబ్ ముఖర్జీ కమిటీ నియమించిన తర్వాత, ఆ కమిటీ పని ఎంత పురోగమించిందో తెలుసుకోవాలని ఒక నాయకుడు వెళ్తే, ప్రణబ్ ముఖర్జీని కాదు సోనియా గాంధీని కలవండని జవాబు వచ్చిందట. అందుకే తెలంగాణకు పరిష్కారం 2014 ఎన్నికల వరకు పోస్టుపోన్ అవుతూ వచ్చింది.

భస్మాసుర హస్తం..

1955లోనే అంబేద్కర్, తాను రాసిన 'థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్'లో వివిధ అంశాలపై కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రాల పునర్విభజన, కులాలను వాడుకొని కాంగ్రెస్ అధికారం పొందడం, సంపూర్ణ మధ్యనిషేధం వంటి ఆలోచనల వరకు ఎన్నో అంశాలను చాలా క్రిటికల్‌గా చూశారు. ఇదే పుస్తకంలో ఒక సందర్భంలో అయితే 'దేవుడు తాను నాశనం చేయాలనుకునే వాళ్లను ముందు పిచ్చి వాళ్లను చేసి తర్వాత నాశనం చేస్తాడట. ప్రస్తుతం దేవుడు కాంగ్రెస్‌ను అదే చేస్తున్నాడు' అని వ్యంగ్యాస్త్రం విసిరారు. 1955లోని కాంగ్రెస్ మీద అంబేద్కర్ చేసిన విశ్లేషణ 2014లో తెలంగాణ ఏర్పడేవరకు కూడా వర్తిస్తుంది. ఈ దేశంలో ఎన్నో సమస్యలను సృష్టించి వాటివల్లే కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. అందులో తెలంగాణ ఒకటి. అందుకే తెలంగాణను ఇచ్చింది నేనే అని ఎంత మొరపెట్టుకున్నా అధికారంలోకి రాలేకపోవడం కూడా ఇందుకే కావచ్చు.

చివరగా.. ఈ వ్యాస పరంపర పస్తున్న కాలంలో పాఠకుల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్ గురించి ప్రస్తావించడం అసందర్భం కాదని భావిస్తున్నాను. 1960ల నుంచి జై తెలంగాణ ఉద్యమాన్ని చూసిన పాఠకులు, మలిదశ ఉద్యమంలో జరిగిన మలుపులతో పాటు సాగిన పాఠకులు, ఈ వ్యాసాలను చరిత్ర డాక్యుమెంటేషన్‌గా భావించారు. తెలంగాణ ఉద్యమంలో జరిగిన ఘటనలను, ద్రోహాలను, ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడిన సందర్భాలను తర్వాతి తరానికి చరిత్ర రూపంలో అందించే అవసరం ఉన్నదని భావించారు. అంటే ఏదో మేరకు ఈ విశ్లేషణ ఉద్దేశ్యం నెరవేరినట్టే.

(సమాప్తం)

వేల్పువమ్మ

నాడు!

కృష్ణమ్మ తలాపున ఉన్నప్పటికీ
కుటుంబాలను సాకలేక వెతలు గతికి
వలస కూలీలుగా బతుకులు చితికి
మనిషిగా మనుగడే బెరికి
కలరు మాకు మహా నాయకులు
ప్రజల గోడు పట్టని గత
దొరబాబులు
ప్రజా సేవకుల మనే ఓట్ల వీడకులు
పచ్చి రక్తం పీల్చే జలగలు

నేడు!

కరుణించిన మా కృష్ణ వేణమ్మ
దీనజన వేదనల కల్పవల్లివమ్మ
రిజర్వాయర్ల పులికిత జలకళవమ్మ
మానవతా మూర్తిని కదిపిన
వేల్పువమ్మ
పాలమూరు దశదిశలు మారనున్నవి
కర్షకుల ఇక్కట్లు తొలగనున్నవి
హర్షంతో మా ప్రాంతాలు
మురియనున్నవి
పంటలతో మా క్షేత్రాలు
తులతూగనున్నవి
మా కృష్ణమ్మకు అభినందనలు

నమిలకొండ నాగేశ్వరరావు
86885 53470

దేశానికే గేమ్ చేంజర్.. కేసీఆర్

భారతదేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముక వ్యవసాయం దశాబ్దాల తరబడి అనేక సవాళ్లతో పోరాడుతున్నది. తక్కువ పంట దిగుబడి, వాతావరణ మార్పులు, సరిపోని మౌలిక సదుపాయాలు ఈ రంగాన్ని పీడిస్తున్నాయి. ఫలితంగా రైతు కష్టాలు తద్వారా దేశ ఆర్థికవృద్ధికి ఆటంకమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అవలంబించిన రైతు సంక్షేమ, సాంకేతిక విధానాలు రైతులకు భరోసా ఇచ్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాయి. తద్వారా తెలంగాణ రాష్ట్రం అతిపిన్న వయస్సులో దేశానికే ఆదర్శంగా నిలిచింది.

చాడ సృజన్‌రెడ్డి
98493 90961

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటంతో రైతుల సాధికారత కోసం కేసీఆర్ వ్యవసాయరంగంలో రైతుల కోసం తన ప్రయాణాన్ని మొదలు పెట్టారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో అనేక రైతు అనుకూల విధానాలను అమలుచేశారు. వ్యవసాయరంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కూడిన కార్యక్రమాలు తెలంగాణ గ్రామీణ స్థితిగతులను మార్చుతూ వ్యవసాయంరంగంలో ఉద్యోగ, ఉపాధి ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి పారిశ్రామిక అవకాశాలు కల్పిస్తూ గ్రామీణ ఆర్థికంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక రూపురేఖలు మార్చడానికి దోహదపడింది. తెలంగాణలో కేసీఆర్ అమలుచేసిన వ్యవసాయ రైతు విధానాలు దేశం మొత్తం అమలుచేస్తే అతి తక్కువ సమయంలో దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి పథంలో పయనించగలుగుతుంది.

రైతుబంధు పథకం రైతులకు పెట్టుబడి సాయం అందించే విప్లవాత్మక కార్యక్రమం. ప్రపంచంలోనే ఇలాంటి పథకం ఎక్కడా లేదు. ఈ పథకం కింద విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి వ్యవసాయ పెట్టుబడి ఖర్చులను భరించడానికి రైతులకు ప్రభుత్వం ఆర్థికసహాయం అందిస్తుంది. ఈ పథకం పంట ఉత్పత్తిని పెంచడమే కాదు, పంట పని తీరుతో సంబంధం లేకుండా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందేలా చేస్తున్నది. రైతు బంధు పథకం రైతుల కష్టాలను, అప్పులభారాన్ని తగ్గించి, చివరికి రైతులు ఆర్థికవ్యవస్థకు సహకారాన్నందించేలా చేస్తున్నది.

కేసీఆర్ గొప్ప ఆలోచనల్లోంచి పుట్టిన మరో బృహత్తర పథకం రైతు బీమా. రైతుకు ఆకాల మరణం సంభవించినప్పుడు ఆయన కుటుంబానికి ఆర్థికభద్రతను కలిగించే రైతు బీమా కార్యక్రమం రైతుకు భరోసాను కల్పించింది. ఈ పథకం కూడా ప్రపంచంలో ఎక్కడా లేదు. ఈ పథకంతో ఉచిత బీమా రైతులకు ఎనలేని భరోసాను కల్పించింది. రైతుకు, రైతు కుటుంబానికి అనుకోని పరిస్థితులు ఎదురైతే పెద్దదిక్కు అయి నిలబడింది. కుటుంబాన్ని రోడ్డున పడకుండా కాపాడింది. రైతులు ఆర్థికంగా పురోగమించడానికి భరోసా నిస్తున్న ఒక మహత్తర పథకం ఈ రైతు బీమా. ఈ పథకం రైతుల పేదరికాన్ని తగ్గించడానికి, వ్యవసాయాన్ని మరింత స్థిరమైన, లాభదాయకమైన వృత్తిగా మార్చడానికి ఒక భరోసా కల్పిస్తున్నది.

దేశంలో వ్యవసాయ ఉత్పాదకతకు ఒక ప్రధాన అడ్డంకి అని నమ్మదగినది నీటిపారుదల సౌకర్యాల కొరత. సీఎం కేసీఆర్ ఈ విషయాన్ని గుర్తించి సమగ్ర నీటిపారుదల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే మిషన్‌కు శ్రీకారం చుట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ 'కాళేశ్వరం' ప్రాజెక్టు సీఎం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం.

కేంద్రం రూపాయి ఇయ్యకున్నా 73 లక్షల ఎకరాలకు పైగా భూమికి నీటిని అందించి, బీడు భూములను సారవంతమైన సాగుభూములుగా మార్చగలిగారంటే ఆయనకు ఎంతటి దూరదృష్టి ఉన్నదో తెలుసుకోవాలి. నీటి లభ్యతతో, నమ్మకమైన నీటి పంపిణీ వ్యవస్థతో రైతులు ధైర్యంగా పండించాలనుకున్న పంటలు పండిస్తున్నారు. దిగుబడిని పెంచుకుంటున్నారు. రైతుల ఆర్థికవృద్ధికి నీటి పారుదల మౌలిక సదుపాయాలపై కేసీఆర్ పెట్టుబడులు గణనీయంగా దోహదపడ్డాయి. తద్వారా వ్యవసాయ దిగుబడులు పెరిగి రాష్ట్ర, దేశ ఆర్థికానికి ఆసరాగా నిలిచారు రైతన్నలు.

కేసీఆర్ పంటల వైవిధ్య ప్రతిపాదకుడు, రైతులు వరి, గోధుమ వంటి సంప్రదాయ పంటలను దాటి కాష్ క్రాప్స్, ఉద్యాన పంటలు, పూల పెంపకం వంటి అధిక విలువైన పంటల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తున్నారు. వైవిధ్య పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, నష్టాలను తగ్గించడం, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం లాంటి లక్ష్యాలను తెలంగాణ వ్యవసాయరంగం సాధించగలిగింది. వైవిధ్యభరితమైన వ్యవసాయం దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఎగుమతి ఆధారిత వ్యవసాయ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా భారత ఆర్థికవ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్నది.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో, రైతులను నేరుగా మార్కెట్‌లతో అనుసంధానం చేయడం, రైతులు తమ ఉత్పత్తులకు మంచి ధర పొందేలా చూడటం వంటి కార్యక్రమాలను కూడా ప్రారంభించింది. ఇది రైతులకు ఆదాయాన్ని అందించడమే కాకుండా, వ్యవసాయ మార్కెట్ మొత్తం సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. ఇలాంటి మార్కెట్-అనుబంధ కార్యక్రమాలు గ్రామీణ ఆదాయాలను పెంచుతున్నాయి, ఉద్యోగాలను సృష్టించగలుగుతున్నాయి. వ్యవసాయ దిగుబడులు పెంచడం ద్వారా ఆర్థికవ్యవస్థను బలపరుస్తాయి.

కేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులను ఉపయోగించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడం ద్వారా, సుస్థిరతకు మద్దతునివ్వడమే కాకుండా దేశీయ విజ్ఞానాన్ని సంరక్షిస్తున్నారు. కేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ప్రపంచ ధోరణులకు అనుగుణంగా ఉంటుంది. ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకొని భారతదేశ ఆర్థికవృద్ధికి దోహదమవుతుంది.

కేసీఆర్ రైతు అనుకూల విధానాలు తెలంగాణ రైతులను ఏ విధంగానైతే ధనికులను చేస్తూ రాష్ట్ర ఆర్థికానికి సింహభాగంగా రూపాంతరం చెందుతున్నదో భారత ఆర్థికవ్యవస్థకు వ్యవసాయం దోహదపడే అవకాశాలున్నాయి. జనాభాలో గణనీయమైన భాగానికి జీవనోపాధిని కల్పిస్తున్న వ్యవసాయం భారతదేశంలో అతిపెద్ద కర్మాగారం. ఎప్పుడైతే ఉపాధి పెరుగుతుందో ఆదాయంతో పాటు ప్రజల ఖర్చు సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా దేశ స్థూల దేశీయోత్పత్తికి వ్యవసాయం దోహదం చేస్తుంది. అంతేకాదు ఆహార భద్రత, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, అగ్రిబిజినెస్ రంగంలో వ్యవసాయ అవకాశాలను అందిస్తుంది. ఈ రంగాలు వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించడం ద్వారా ఉద్యోగాలను సృష్టిస్తాయి. గ్రామీణ ఆర్థికాన్ని బలోపేతం చేసుకుంటూ దేశ ఆర్థికవ్యవస్థకు దోహదం చేస్తాయి. కేసీఆర్ సృష్టించి ఆచరించిన రైతు సంక్షేమ, అభివృద్ధి విధానాలను దేశం మొత్తం గనక అమలుచేస్తే అతి తక్కువ సమయంలో దేశం ఆహార సూచీలో ఎగబాకి గ్రామీణ, పట్టణ ఆర్థికాలను బలపరుస్తూ దేశ ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ పరిశ్రమలను స్థాపిస్తూ తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరపరుస్తుంది.

2001-2002 కేంద్ర ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు నూతన పింఛన్ అమలు చేయబోతున్నట్టు ప్రకటించింది. అప్పటికే నూతన పింఛన్ విధానం రూపకల్పనపై బీకే భట్టాచార్య కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 2004 జనవరి 1 నుంచి నూతన పింఛన్‌ను (ఎన్‌పీఎస్)ను అమలుచేస్తున్నది. రక్షణ శాఖను మినహాయిస్తూ అన్నిశాఖల్లో దీన్ని ప్రవేశపెట్టాలి.

పాత పింఛన్‌పై భరోసా!

దామూక కమలాకర్
98497 71718

ఉమ్మడి ఏపీలో 2004, జనవరి 9 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు కాంట్రీబ్యూటరీ పింఛన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలుచేస్తున్నది. అప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ పింఛన్ రూల్స్ 1980 ప్రకారం నాన్-కాంట్రీబ్యూటరీ డిఫైన్డ్ పింఛన్ స్కీమ్‌ను రద్దుచేస్తూ కాంట్రీబ్యూటరీ పింఛన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలుచేసింది. దీన్ని చందా ఆధారిత, భాగస్వామ్య పింఛన్ పథకం అంటారు.

1.ఉద్యోగి పదవీ విరమణ తర్వాత, పదవీ విరమణ చేసిన చివరి నెలలోని మొత్తం వేతనం నుంచి సగం మొత్తాన్ని ఉద్యోగికి ప్రతి నెలా పింఛన్‌గా చెల్లిస్తారు. ఉదాహరణకు ఉద్యోగి పదవీ విరమణ చేసిన నెలలో రూ.లక్ష జీతం ఉంటే పదవీ విరమణ చేసిన మరుసటి నెల నుంచి రూ.50 వేలు పింఛన్‌గా చెల్లిస్తారు. ఇది సీపీఎస్‌లో లేదు. 2. ఉద్యోగి సర్వీస్‌లో ఉండి మరణిస్తే వారి కుటుంబసభ్యులకు ఒకరికి ఉద్యోగం, కుటుంబ పింఛన్ ఇస్తారు. దీన్నే 'డెత్ కమ్ ఫ్యామిలీ పింఛన్' అంటారు. ఇది కూడా సీపీఎస్‌లో లేదు. 3.ఉద్యోగి పదవీ విరమణ తర్వాత మరణిస్తే వారి భార్య లేదా భర్త లేదా వారిపై ఆధారపడిన వారికి నెలనెలా పింఛన్ చెల్లిస్తారు. దీన్ని 'కుటుంబ పింఛన్' అంటారు. ఇది కూడా సీపీఎస్‌లో లేదు. 4.ఉద్యోగి పదవీ విరమణ తర్వాత తన పింఛన్‌లో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి అమ్ముకొని నగదు పొందుతాడు. దీన్నే 'కమ్యూటేషన్' అంటారు.

5. పదవీ విరమణ పొందినవారికి రూ.12 లక్షలు గ్రాట్యుటీ సీపీఎస్‌లో లేదు. 6. ప్రతి ఐదేండ్లకోసారి ప్రభుత్వం వేసే పీఆర్సీలో వేతన పెరుగుదలలో ఉద్యోగుల వలె పింఛనర్స్‌కూ వేతన ఫిట్‌మెంట్, డీఏ, ఐఆర్‌లలో పెరుగుదల ఉంటుంది. ఈ సౌకర్యం సీపీఎస్‌లో లేదు. 7. పాత పింఛన్‌లో ఉద్యోగికి జీపీఎఫ్ అకౌంట్ ఉండటం వల్ల నెలకు కొంత సొమ్మును అకౌంట్‌లో వేస్తూ అవసరం ఉన్నప్పుడు, పార్ట్ ఫైనల్, లోన్ రూపంలో ఆసుపత్రి ఖర్చులకు, పిల్లల చదువులకు, పెండ్లిళ్లకు ఉపయోగించుకుంటారు. ఇది సీపీఎస్ విధానంలో లేదు. పాత పింఛన్ విధానంలో ఈ సౌకర్యాలన్నీ ఉండటం వల్ల ఉద్యోగి పదవీ(సర్వీస్)లో ఉన్నప్పుడు గాని పదవీ విరమణ అనంతరం గాని భరోసాతో, సామాజిక భద్రతతో జీవిస్తాడు.

పాత పింఛన్‌లో ఉన్న సౌకర్యాన్ని తొలగిస్తూ నూతనంగా తెచ్చిన సీపీఎస్ విధానంలో ఉద్యోగికి పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్) కేటాయిస్తూ ఉద్యోగి నెల జీతం నుంచి బేసిక్, డీఏలలో పది శాతాన్ని అందులో జమచేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా చెల్లిస్తుంది. ఇలా ఉద్యోగి పదవీ విరమణ వరకు చెల్లిస్తుంటారు. దీన్ని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌డీఎల్) మానిటరింగ్ చేస్తుంది. ఈ సంస్థ కేంద్రం ఆధీనంలో పనిచేస్తుంది. అయితే ఉద్యోగి వాటాను, మూడు భాగాలుగా విభజిస్తూ ఎస్‌బీఐ 33 శాతం, యూటీఐ బ్యాంక్‌లో 34 శాతం, ఎల్‌ఐసీలో 33 శాతం పెట్టుబడులుగా ఈ మొత్తాన్ని పెడుతారు. ఉద్యోగి పదవీ విరమణ అనంతరం దాచుకున్న మొత్తం సొమ్ము నుంచి 60 శాతాన్ని నగదుగా చెల్లిస్తూ మిగతా 40 శాతాన్ని షేర్ మార్కెట్లో యాన్యుటీగా పెడుతారు. దీన్నుంచి వచ్చే లాభ, నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగికి పింఛన్ చెల్లిస్తారు. ఇప్పటికి పదవీ విరమణ చేసిన లేదా మరణించిన ఉద్యోగులకు నెలకు 2,000 నుంచి 3,000 వరకు పింఛన్ వస్తుంది. అంటే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ కన్నా తక్కువే. అందుకే షేర్ మార్కెట్‌పై ఆధారపడే జీతాల వల్ల ఉద్యోగ విరమణ పొందిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇది ఉద్యోగులకు గుదిబండగా మారింది.

**తెలంగాణ ప్రభుత్వంలో సీపీఎస్ పరిస్థితి, సీపీఎస్ విధానం వల్ల ప్రభుత్వానికి, ఉద్యోగులకు నష్టం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి సీపీఎస్ విధానాన్ని రద్దు